పొంచి ఉన్న వ్యాధులు.. జాగ్రత్తలే మేలు

- హాస్టళ్లల్లో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలి
- జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్
- చేవెళ్ల డివిజన్‌లోని పలు వసతి గృహాలను సందర్శించిన వైద్యసిబ్బంది

విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్

షాబాద్/చేవెళ్ల టౌన్, సెప్టెంబర్ 2: సీజనల్ వ్యాధులపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ అన్నారు. రంగారెడ్డి కలెక్టర్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు సోమవారం చేవెళ్ల డివిజన్‌లోని షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల్లోని 49 వసతి గృహాలను వైద్య సిబ్బందితో కలిసి సందర్శించారు. అనంతరం వంట సామగ్రిని పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. సీజనల్ వ్యాధుల నివా రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొత్తం 49 వసతి గృహాల్లో 24 మంది విద్యార్థులకు జ్వరం లక్షణాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వారికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించామన్నారు. వసతి గృహాల్లో వంట సిబ్బంది కూరగాయలు కడిగిన తర్వాతే కోసి వండాలని చెప్పారు. వంట చేసిన 45 నిమిషాల వ్యవధిలోనే విద్యార్థులకు వడ్డించాలని సూచించారు. ఏ మాత్రం అజాగ్రత్త వహించినా ప్రస్తుత వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఆయన వెంట డివిజన్‌లోని ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, హాస్టళ్ల వార్డెన్లు, ప్రిన్సిపాళ్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

యాచారం, సెప్టెంబర్ 2 : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గున్‌గల్, గడ్డమల్లాయగూడ తదితర గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఇండ్ల మధ్య పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను సిబ్బందితో తొలగింపజేశారు. నిలిచిన వర్షం నీటిలో బ్లీచింగ్ పౌడర్ వేయించారు. సంపులు, ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ వేయించారు. మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీలత, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

రోడ్డుపై బ్లీచింగ్ పౌడర్‌ను చల్లిస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత

శిథిలావస్థకు చేరిన ఇండ్లను కూల్చి వేయాలి

ముకునూరులో శిథిలావస్థకు చేరిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటమ్మ తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్, సెప్టెంబర్ 2 : గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన ఇండ్లను వెంటనే కూల్చి వేయాలని ఎంపీడీవో వెంకటమ్మ అన్నారు. మండల పరిధిలోని ముకునూరు గ్రామంలో సోమవారం ఆమె పర్యటించింది. శిథిలావస్థకు చేరిన ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలతో పురాతన ఇండ్లు కూలిపోయే అవకాశమున్నదని తెలిపారు. వెంటనే పురాతన ఇండ్లల్లో ఉన్న ప్రజలను వెంటనే ఖాళీ చేయించడంతో పాటు పాడుపడిన ఇండ్లను వెంటనే కూల్చి వేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులున్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం

పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు అందజేసిన సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, సెప్టెంబర్ 2 : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. సోమవారం కడ్తాల్ పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి స్థానిక నాయకులతో కలిసి ఆయన రెయిన్ కోట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల పనితీరు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మాజీ గ్రామ అధ్యక్షుడు మంగళ్‌పల్లి నర్సింహ, మార్కెట్ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు నరేందర్‌రెడ్డి, రామచంద్రయ్య, రాములుయాదవ్, సురేందర్‌రెడ్డి, అశోక్‌ముదిరాజ్, వెంకటేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలి

వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు

షాద్‌నగర్‌టౌన్, సెప్టెంబర్ 2: విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండడంతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు నాగేంద్రబాబు, జగదీశ్వర్ అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు అదేశాల మేరకు షాద్‌నగర్ డివిజన్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో సోమవారం హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీని వాసులుతో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం మందులు అందజేశారు. కార్యక్రమంలో వార్డెన్లు రాజు, సులోచన, ఏఎన్ఎంలు లక్ష్మి, మంజుల, స్వప్న, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీటీసీల ఫోరం మాజీ జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, సెప్టెంబర్ 2 : మండల కేంద్రానికి చెందిన మంకి రాములు ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి సోమవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.4వేలు అందజేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న కాలె శివకు రూ.3వేలు, కంబాల కృష్ణ ఇంటి నిర్మాణానికి 10 సి మెంట్ బస్తాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బీచ్యానాయక్, జహంగీర్‌బాబా, మల్లయ్య, శ్రీనివాస్, రాజేశ్, భానుకిరణ్, షాబుద్దీన్, శ్రీకాంత్, రామకృష్ణ, రవి, మణికిరణ్, మహేశ్, శివకృష్ణ, వెంకటరమణ, శ్రీశైలం, శంకర్, యాదగిరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సత్తయ్యకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్/షాద్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 2 : రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండల పరిధిలోని గ్రామాల్లో వాగులు, చెరువులు పొంగి పొర్లాయి. వెలిజర్లలో నిరుపేద కుటుంబానికి చెందిన సత్తయ్య ఇల్లు వర్షానికి దెబ్బతిన్నది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డితో కలిసి సోమవారం గ్రామానికి వెళ్లి సత్తయ్యను పరామర్శించి రూ.10వేల నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎవరూ అధైర్య పడొద్దన్నారు. దుసకల్ చెరువు అలుగు పారుతుడటంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగారెడ్డిగూడ శివారులోని వీరమోని చెరువు నీటి ప్రవాహాన్ని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు పరిశీలించారు. నీటి ప్రవాహం విడుదల కాకుండా చుట్టూ ప్రహరీని నిర్మించుకున్న వ్యక్తిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు.

వర్షాలతో నష్టపోయిన బాధితులకు చేయూత

కొత్తూరు, సెప్టెంబర్ 2: భారీ వర్షాలతో నష్టపోయిన బాధితులకు కాంగ్రెస్ అండగా ఉంటుందని పార్టీ మండలాధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్ తెలిపారు. మున్సిపాలిటీలోని తిమ్మాపూర్‌లో భారీ వర్షాలతో ఇండ్లు కూలి నష్టపోయిన యాగాపురి యాదయ్య, కొడిచెర్లకు చెందిన దాసరి ప్రశాంత్‌కు ఎమ్మెల్యే తక్షణ సహాయం కింద సోమవారం రూ.10 వేల ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇందూరి శ్రీనివాస్, కర్రోళ్ల సురేందర్, మాజీ సర్పంచ్ ఏనుగు జనార్దన్‌రెడ్డి, గోవింద్‌నాయక్, రాములుగౌడ్, శివకుమార్‌గౌడ్, పెద్దాపురం కృష్ణ, శివశంకర్, గోవింద్ నాయక్, మల్లికార్జున్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కొడిచెర్ల కృష్ణ, నవీన్, శ్రీధర్, యాదయ్య పాల్గొన్నారు.

రుణమాఫీ విషయంలో యూనిట్‌గా ముందుకెళ్లాలి

సదస్సులో మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గడిగే గజేందర్‌గౌడ్

షాబాద్, సెప్టెంబర్ 2: రుణమాఫీ విషయంలో ప్రభుత్వం రైతు యూనిట్‌గా ముందుకెళ్లాలని భారతీయ కిసాన్ సంఘ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గడిగే గజేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో భారతీయ కిసాన్ సంఘ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. కొన్నేండ్లుగా రేషన్ కార్డులు ఇవ్వని కారణంగా అనేక రైతు కుటుంబాలు ఒకే రేషన్ కార్డులో ఉన్నాయని చెప్పారు. రుణమాఫీ విషయంలో రేషన్‌కార్డు ప్రామాణికం కాదని ప్రభుత్వం ఓ పక్కన ప్రకటిస్తూ, నిబంధనలు మాత్రం జారీ చేయకపోవడం శోచనీయమన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటైన కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం చట్టాన్ని అమలులోకి తేవాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకులు కిసాన్ క్రెడిట్ అకౌంట్ ద్వారా రైతులకు రుణాలు మంజూరు చేసేలా ప్రయత్నించాలన్నారు. బలరామ జయంతి సందర్భంగా ఈ నెల 10న జిల్లా రైతు దినోత్సవ కార్యక్రమాన్ని తక్కుగూడలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ షాబాద్ మండలాధ్యక్షుడు దండు యాదవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణరెడ్డి, మండల సహాయ కార్యదర్శి చంద్రయ్య, పోలారం గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, వెంకమ్మగూడ అధ్యక్షుడు భీమయ్య, షాబాద్ గ్రామ అధ్యక్షుడు సత్యం, పాండుగుప్తా, కేశవగూడ అధ్యక్షుడు ఒగ్గు మల్లేశ్, మాచన్‌పల్లి అధ్యక్షుడు రామస్వామిగౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మిలాన్ ఉన్ నబీని ప్రశాంతంగా జరుపుకోవాలి

ముస్లింలతో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు

కొత్తూరు, సెప్టెంబర్ 2 : మిలాన్ ఉన్ నబీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు సూచించారు. మండల పరిధిలోని జేపీ దర్గాను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి ముస్లింలతో ఏసీపీ మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకుంటారని వివరించారు. కార్యక్రమంలో కొత్తూరు సీఐ నరసింహారావు, స్థానిక ముస్లింలు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై అధికారుల విచారణ

ఎల్లమ్మతండాలో ఫీల్డ్‌అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శిని నిలదీస్తున్న ఉపాధి కూలీలు

మంచాల, సెప్టెంబర్ 2 : మండల పరిధిలోని ఎల్లమ్మ తండాలో నిర్వహించిన ఉపాధి పనులపై అధికారులు విచారణ చేపట్టారు. ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతి అక్రమాలపై గ్రామస్తులు జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం ఏపీవో వీరాంజనేయులుతో పాటు సిబ్బంది తండాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిని కూలీలు ఆయనకు వివరించారు. నిబంధనల ప్రకారం గ్రామంలో ఉన్న నిరుపేదలు ఉపాధి పనులు చేయాల్సి ఉందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామంలో లేని వ్యక్తుల భార్యల పేర్లతో పనులు చేయకున్నా చేసినట్లు, వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయించారన్నారు. వారితో ఫీల్డ్ అసిస్టెంట్ కుమ్మక్కై డబ్బులు స్వాహా చేశారని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో ఫీల్డ్‌అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, మండల అధికారులు కుమ్మక్కై ఈ తతంగాన్ని నడిపించారన్నారు. ఈవి షయాన్ని గ్రామస్తులు ఫీల్డ్అ సిస్టెంట్, పంచాయతీ కార్యదర్శిని పంచాయతీ కార్యాలయంలో ఉపాధి కూలీలు నిలదీయడంతో ఎలాంటి సమాధానం చెప్పకుండా అక్కడి నుంచి తప్పుకున్నారు. ఈ విషయమై ఎంపీడీవో బాలశంకర్‌ను ఫోన్‌లో వివరణ కోరగా తప్పుచేసిన వారిని ఉపేక్షించేది లేదన్నారు.

కాంగ్రెస్ పాలనలో పాడి రైతులకు అన్యాయం

చంద్రధనలో ఆందోళన చేస్తున్న పాడి రైతులు

కడ్తాల్, సెప్టెంబర్ 2 : రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకొంటున్న కాంగ్రెస్ పాలనలో పాడి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని రైతులు వేదన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా పాడి రైతులకు పాల బిల్లులు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం తలకొండపల్లి మండల పరిధిలోని చంద్రధనలో బీఎంసీ పరిధిలోని రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పా డి రైతులు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీలో పాలు పోస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పాల బిల్లులు సక్రమంగా చెల్లించడం లేదన్నారు. 15 రోజులకోసారి పాల బిల్లులు చెల్లించాల్సి ఉండగా, రెండు నెలలుగా చెల్లించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. చంద్రధన బీఎంసీ పరిధిలో మొత్తం రూ.2 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే చెల్లించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమార్, మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, నాయకులు శేఖర్‌యాదవ్, రాజు, రవీందర్‌రెడ్డి, నర్సింహ, చెన్నయ్య, నరేశ్, రాజశేఖర్, అజయ్, రామచంద్రయ్య, నర్సింహారెడ్డి, మల్లేశ్, లింగారెడ్డి, రాఘవేందర్, శ్రీకాంత్, కృష్ణయ్య, ప్రతాప్‌రెడ్డి, నందు, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

అనాథలకు దాతలు చేయూతనివ్వాలి

అనాథలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న రాజేశ్ తదితరులు

ఆదిబట్ల, సెప్టెంబర్ 2 : అనాథలను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని బీఆర్ఎస్ ఇబ్రహీంపట్నం యువజన నాయకుడు పాతూరి రాజేశ్ కోరారు. సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని ఆలేటి అతోం వరల్డ్ ఆశ్రమంలో అనాథలకు నిత్యావసర సరుకులు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అనాథలను చేయూతనిచ్చేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకులు శంకర్, ప్రసాద్, శివ, గణేశ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన

మోకిలాలో వరద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 2 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు శంకర్‌పల్లి మండల పరిధిలోని మోకిలా గ్రామ పరిధిలో ఉన్న పలోమా విల్లాస్ గేటెడ్ కమ్యూనిటీ జలమయమయింది. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టక పోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సోమవారం మోకిలా పరిధిలోని వరద ముం పు ప్రాంతాలను పరిశీలించారు. బాధితులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట సంబంధిత అధికారులు, స్థానిక నేతలు తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన నర్సింహ ముదిరాజ్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు రవీందర్‌రెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంగళపల్లిలో కూలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ లలిత

ఆమనగల్లు, సెప్టెంబర్ 2 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ లలిత అన్నారు. మండల పరిధిలోని మంగళపల్లి, సంకటోనిపల్లి గ్రామాల్లో రెండు మట్టి ఇండ్లు కూలిపోయాయి. విషయం తెలుసుకొన్న తహసీల్దార్ సిబ్బందితో కలిసి సోమవారం ఆయా గ్రామాలను సందర్శించారు. బాధితులను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధితులు ఆమెను కోరారు. అనంతరం ఆరు గురు పేదలకు 10 కిలోల చొప్పున రేషన్ బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ చెన్నకేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో వైద్య శిబిరం

శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

కడ్తాల్, సెప్టెంబర్ 2: తలకొండపల్లి మండల పరిధిలోని కేజీబీవీలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. విద్యార్థినులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, హాస్టల్ గదులను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి స్నేహ, సూపర్‌వైజర్ యాదమ్మ, హెల్త్ అసిస్టెంట్ రామచంద్రయ్య, ల్యాబ్ టెక్నీషియన్ రాజేందర్, ఆశ వర్కర్లు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అపిల్ అవెన్యూ కాలనీ పరిశీలన

మాసబ్ చెరువు కాల్వను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి

తుర్కయాంజాల్, సెప్టెంబర్ 2 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్‌లో ఉన్న అపిల్ అవెన్యూ కాలనీ మధ్య నుంచి పారుతున్న మాసబ్ చెరువు అలుగు కాల్వను పలువురు అధికారులు పరిశీలించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచన మేరకు సోమవారం మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ ఏఈ తాప్సిన్ రజా, పలు శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. అలుగు పారుతుండడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

చెత్త డంపునకు తప్పని తిప్పలు


రాగన్నగూడ వార్డు కార్యాలయం ఎదుట నిలిపి ఉన్న చెత్త వాహనాలు

తుర్కయాంజాల్, సెప్టెంబర్ 2 : మున్సిపాలిటీ పరిధిలో ఇండ్ల నుంచి సేకరించిన చెత్తను డంప్ చేయడానికి స్వచ్ఛ ఆటో కార్మికులకు తిప్పలు తప్పడం లేదు. ఆటోనగర్ డంపింగ్ యార్డులోకి జీహెచ్ఎంసీ పరిధిలోని చెత్త వాహనాలు మినహా ఇతర మున్సిపాలిటీలకు చెందిన చెత్త వాహనాలు అనుమతించబోమని జీహెచ్ఎంసీ అధికారులు స్పష్టం చేశారు. దీంతో తుర్కయాంజాల్ మున్సిపాలిటీకి చెందిన స్వచ్ఛ ఆటో వాహనాల కార్మికులు వాహనాలను సోమవారం రాగన్నగూడ వార్డు కార్యాలయం ఎదుట చెత్తతో సహ నిలిపివేశారు. ఆటోనగర్ డంపింగ్ యార్డులో స్వచ్ఛ వాహనాల చెత్తను డంప్ చేయకుండా అడ్డుకుంటున్నారని సమస్యను కార్మికులు తుర్కయాంజాల్ మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కమిషనర్ అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆటోనగర్ డంపింగ్ యార్డులోకి చెత్తను తీసుకొచ్చే స్వచ్ఛ వాహనాల చెత్త బరువు సరిగ్గా తెలియక తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని టిప్పర్ వాహనంలో చెత్తను నింపి డంప్ చేసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులు సూచించినట్లు తెలిపారు. మరో 10 రోజుల పాటు ఆటోనగర్‌లో చెత్తను డంప్ చేసిన అనంతరం జవహర్‌నగర్‌కు చెత్తను తరలించాలని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారని అన్నారు. అనంతరం వార్డు కార్యాలయం ముందు నిలిపి ఉన్న చెత్త వాహనాలను నాగోల్‌లోని డంపింగ్ యార్డుకు చెత్తను తరలించినట్లు కమిషనర్ తెలిపారు.

ఉపకార వేతనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

షాబాద్, సెప్టెంబర్ 2: రంగారెడ్డి జిల్లాలోని పలు కళాశాలల్లో చదువుతున్న షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు 2024-25 సంవత్సరానికి పోస్ట్-మెట్రిక్ ఉపకార వేతనాల మంజూరు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకార వేతనాల కోసం ఆయా కళాశాలల్లో ఈ సంవత్సరం ప్రవేశం పొందిన విద్యార్థులు కొత్తగా రిజిస్ట్రేషన్/గతంలో అడ్మిషన్ పొంది చదువును కొనసాగిస్తున్న విద్యార్థులు రెన్యువల్ రిజిస్ట్రేషన్ E pass Web Site నందు 31-12-2024 వరకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు తమ కళాశాలల్లో చదువుతున్న వారిలో అర్హులైన విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. గడువు తేదీలోపు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

మాట్లాడుతున్న ఏసీపీ కేవీపీ రాజు

మంచాల, సెప్టెంబర్ 2 : గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆరుట్ల గ్రామ సమీపంలో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో పలు శాఖల అధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ బాబ్యానాయక్, ఎంపీడీవో బాలశంకర్, ఏఎస్సై సతీశ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం ఏడీఏగా సుజాత

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 2 : వ్యవసాయ శాఖ ఇబ్రహీంపట్నం డివిజన్ అధికారిగా సుజాత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మహేశ్వరం ఏడీఏగా విధులు నిర్వర్తించిన సుజాత సోమవారం ఇక్కడికి బదిలీపై వచ్చారు. నియోజకవర్గంలోని రైతులకు అందుబాటులో ఉండి వారి సూచనలు, సలహాలు ఇస్తానని తెలిపారు.

వ్యాపారులు లైసెన్స్‌లు తీసుకోవాలి

షాబాద్, సెప్టెంబర్ 2: రంగారెడ్డి జిల్లాలోని టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, కిరాణా వ్యాపారస్తులు తప్పనిసరిగా ఫుడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి ఉదయ్ కిరణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫుడ్ లైసెన్సు కోసం ఆధార్‌కార్డు, పాస్‌ఫోర్ట్ సైజు ఫొటోతో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9492301835/9705079576 నంబర్లను సంప్రదించాలన్నారు.

రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ

వెల్జాల్‌లో చేపట్టిన కుటుంబ నిర్ధారణ సర్వేలో పాల్గొన్న ఏవో రేణుకాచక్రవర్తి

కడ్తాల్, సెప్టెంబర్ 2 : రుణమాఫీ కాని రైతుల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు సేకరిస్తున్నారు. సోమవారం తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్‌లో వ్యవసాయ శాఖ మండల అధికారిణి రేణుకాచక్రవర్తి ఆధ్వర్యంలో, అధికారులు కుటుంబ నిర్ధారణ సర్వేను చేపట్టారు. రుణమాఫీ కాని రైతుల వివరాలను అధికారులు సేకరించారు. కుటుంబ సభ్యులు, ఆధార్, ఫొటో తదితర వివరాలను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

సీఐకి చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్లు

ఆదిబట్ల, సెప్టెంబర్ 2 : సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో సీసీ కెమెరాల మరమ్మతుల కోసం ఎస్ఎస్ టెక్నాలజీ వారికి కార్పొరేటర్లు తోట శ్రీధర్‌రెడ్డి, నిమ్మల సునీతాశ్రీకాంత్‌గౌడ్, గూడెపు ఇంద్రసేన కలిసి రూ.80వేల చెక్కును సీఐకి అందజేశారు. ఈ సందర్భంగా సీఐ కార్పొరేటర్లను అభినందించారు.